క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ఎడపల్లి(బోధన్): జానకంపేటలో నవీపేట్–జానకంపేట ప్రధాన రహదారిపై ఎడపల్లి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు చూపని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఏఎస్సై ఇలియాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వేల్పూర్: జాన్కంపేట్‌లో ఎడ్ల ప్రభుదాస్‌కు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, నాయకులు జి.గంగారెడ్డి, జేమ్స్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, జయరాజ్, వినోద్, నరేశ్, ప్రభాకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దౌర్జన్యాలు అరికట్టాలి



ఆర్మూర్‌టౌన్: దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను తక్షణమే అరికట్టాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల మాసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలోని ఘోరంచలో బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధుడి విగ్రహం ప్రతిష్ఠించినందుకు దళితులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. ఇదే విధంగా కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి దళిత ఎంపీ గడిసెల వంశీ కృష్ణకు ఆహ్వానం అందకపోవడం సరికాదన్నారు. పుష్కరాల సెక్రటరీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఐత్వార్‌పేట్ లింగన్న, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంతం మురళీధర్, ఆర్మూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పింజ సుదర్శన్, కొంతం పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

ఇందల్వాయి: ఎమ్మెల్సీ కవిత మంజూరు చేసిన నిధులతో మండలంలోని దేవితండా, రూప్ల నాయక్ తండా, మేఘ్యనాయక్ తండా, చంద్రయాన్‌పల్లి తండా, సిర్నాపల్లి గ్రామాల్లో ఏడు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీపీ రమేష్ నాయక్ తెలిపారు. దేవితండాలో ఏర్పాటు చేసిన లైట్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఒక్కో లైట్ విలువ రూ.1.50 లక్షలని ఆయన తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ కవితకు, అందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ సభ్యత్వం రద్దు

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ కార్యకర్త చెలిమెల నవీన్‌ను జిల్లా అధిష్ఠానం పార్టీ సభ్యత్వం రద్దు చేసి, సస్పెండ్ చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ యాదవ్ మాట్లాడుతూ.. నవీన్ కొన్ని రోజులుగా పార్టీ సిద్ధాంతాలు, నియమాలకు విరుద్ధంగా ఇతర పార్టీల నాయకులతో కలిసి పనిచేస్తూ పార్టీకి నష్టం చేస్తున్నాడని గుర్తించిందని తెలిపారు. అధిష్ఠానం ఆయన ప్రాథమిక సభ్యత్వం రద్దు చేస్తూ, బీజేపీ నుంచి పూర్తిగా తొలగిస్తున్నట్లు ప్రకటించిందని చెప్పారు. చెలిమెల నవీన్ సోషల్ మీడియాలో పెట్టే పోస్టులతో గానీ, ఇతరులపై చేసే విమర్శలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

నత్త నడకన అదనపు గదుల నిర్మాణం

- బాల్కొండ ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ నిధులు రూ.27 లక్షలు మంజూరు
- అయినా ముందుకు సాగని పనులు



స్లాబ్ స్థాయిలో ఉన్న నిర్మాణ పనులు

బాల్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం 2023–24 ఏడాదిలో పీఎంశ్రీ నిధులు రూ.27 లక్షలు మంజూరయ్యాయి. కాని టెండర్లు 2024–25 ఏడాదిలో పూర్తి చేశారు. పనులను 2024 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఇప్పటి వరకు పనులు పిల్లర్లపై స్లాబ్ వేసే దశలో ఉన్నాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న గదుల్లో ఒకటి ల్యాబ్ కోసం మరొకటి తరగతి కోసం వినియోగించుకోవాలని నిబంధనల్లో పేర్కొన్నారు. కాని ఇప్పటి వరకు పనులు వేగవంతం కావడం లేదు. గతేడాది 401 మంది విద్యార్థులు చదువుకున్నారు. వచ్చే ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం నిర్మిస్తున్న తరగతి గదులు పూర్తయినా మరో రెండు తరగతి గదుల కొరత తప్పదు. అయినా పనులను వేగవంతం చేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు డ్రా చేసుకునే అవకాశం..

ప్రస్తుతం ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న గదులకు పీఎంశ్రీ నిధులు ముందే విడుదల చేస్తారు. చేపట్టిన పనుల ప్రకారం నిధులను డ్రా చేసుకునే అవకాశం ఉంది. కాని పనులు మాత్రం వేగవంతం కావడం లేదు. రూ.10.50 లక్షలు బ్యాంకు ఖాతాల్లో మూలుగుతున్నాయి. పనులు చేపట్టి ఇంజినీర్ వాల్యూయేషన్ సర్టిఫికెట్ ప్రకారం డ్రా చేసుకునే అవకాశం ఉంది. కాని ఇక్కడ పనులకు రాజకీయ గ్రహణం పట్టడం వల్ల కొన్నాళ్లు ఆలస్యమైంది. పాలకులు స్పందించి నిర్మాణంలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేగవంతం చేయాలని సూచించాం

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. పనులు చేపట్టిన ప్రకారం బిల్లులు వెంటనే తీసుకునే అవకాశం ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

జాడ లేని రొయ్య..!

- గతేడాది ఎస్సారెస్పీలో రొయ్య సీడ్ వదలని ప్రభుత్వం
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న మత్స్యకారులు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుత సంవత్సరం రొయ్య జాడ లేకుండా పోయింది. గతేడాది ప్రాజెక్ట్‌లో రొయ్యల సీడ్‌ను ప్రభుత్వం వదల లేదు. దీంతో ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో రొయ్యలు కనుమరుగయ్యాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రయోగాత్మకంగా రొయ్యల సీడ్‌ను ప్రాజెక్ట్‌లో వదిలారు. ఆ ఏడాది మత్స్యకారులకు మంచి లాభాలు వచ్చాయి. ఇలా ప్రతి సంవత్సరం 20 లక్షల రొయ్యల సీడ్‌ను ప్రాజెక్ట్‌లో వదిలారు. మే మధ్య నుంచి జూన్ వరకు నిత్యం రొయ్యల వేట సాగేది. రొయ్యలు కిలో రూ.400 ధర పలికేవి. దీంతో మత్స్యకారుల ఆదాయం పెరిగేది. కానీ ప్రస్తుతం రొయ్యలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్ట్‌లో తొలిసారి రొయ్య సీడ్ వేసిన సంవత్సరం వేసవిలో చేపలు అనేకం మృత్యువాత పడ్డాయి. దీంతో రొయ్యల వలనే చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు రొయ్యల సీడ్ వద్దని డిమాండ్ చేశారు. తర్వాత చేపలు చనిపోవడానికి ఇతర కారణాలు ఉన్నాయంటు మత్స్యశాఖ అధికారులు తెలుపడంతో రొయ్యలను వదులుటకు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. కనీసం నెలన్నర రోజులు రొయ్యల వేట సాగేది. అలా నిత్యం రెండు కిలోలు చిక్కిన రూ.800 ఆదాయం వచ్చేది అని మత్స్యకారులు అంటున్నారు. ప్రస్తుత సంవత్సరమైన రొయ్యల సీడ్‌ను ప్రాజెక్ట్‌లో వదలాలని కోరుతున్నారు.

చేప పిల్లల్లోనూ కోత..

గతేడాది ప్రాజెక్ట్‌లో 62 లక్షల చేప పిల్లలను వదలాలి. కానీ బడ్జెట్ సమస్య అంటూ 50శాతం అనగా 31 లక్షల చేప పిల్లలను మాత్రమే వదిలారు. ప్రస్తుతం వేసవిలో నీరు తగ్గుముఖం పట్టిన కూడ చేపల వేట అంతగా సాగడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రొయ్య విత్తనం వేయాలి



ప్రాజెక్ట్‌లో రొయ్యల విత్తనం వేయాలి. రొయ్యల వలన మంచి ఆదాయం వస్తుంది. గతేడాది ప్రభుత్వం రొయ్యల విత్తనం వేయక పోవడంతో ప్రస్తుతం రొయ్యలు లేకుండా పోయాయి. చేప పిల్లలు కూడ సగం వేశారు. చేపల వేట కూడ అంతా సాగడం లేదు.

– నారాయణ, మత్స్యకారుడు

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రాజెక్ట్‌లో చేపల వేట సాగడం లేదు. రొయ్యల సీడ్ వేయక పోవడంతో అవి కూడ లేకుండ పోయాయి. మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ ఏడాది అయిన ప్రభుత్వం స్పందించి చేప పిల్లలు, రొయ్య సీడ్‌ను పూర్తిగా వదలాలి.

– నర్సయ్య, మత్స్యకారుడు

భక్తితో చేసే ఏ పనైనా సఫలీకృతమవుతుంది



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రూబెన్‌మార్క్

బోధన్‌టౌన్(బోధన్): దేవుని మీద భక్తితో చేసే ఏ పనైనా సఫలీకృతమవుతుందని ఇన్‌చార్జి మోడరేట్ డాక్టర్ రూబెన్ మార్క్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆచన్‌పల్లిలోగల సీఎస్ఐ చర్చిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవ, శాంతి, భక్తి మార్గంలో నడవాలన్నారు. ఆయనను కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. చర్చి ఫాదర్ ప్రభాకర్, కమిటీ ప్రతినిధులు దమ్మల్ల జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, తదితరులున్నారు.

పుచ్చకాయతో జన్మదిన వేడుకలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని శ్రీరామ కాలనీలో ఆర్మూర్ ఏరియా ప్రముఖ చార్టెడ్ అకౌంట్, ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన స్నేహితులు వినూత్న పద్ధతిలో నిర్వహించారు. సాధారణంగా జన్మదిన వేడుకలంటే కేక్ తెచ్చి కోయించేవారు. అలా కాకుండా రైతులు పండించే పుచ్చకాయను కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. స్నేహితులు జీవీ నర్సింహారెడ్డి, రఫీక్, రాజు, అర్గుల్ సురేష్, పుట్టి మురళి, సందీప్, సుదర్శన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

'పల్లె దవాఖానాను వెంటనే ప్రారంభించాలి'

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో పూర్తయిన పల్లె దవాఖాన భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పల్లె దవాఖాన భవనం పూర్తయి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కనీసం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మోత్కూరి లింగాగౌడ్ అన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు హనుమాన్ ఆలయంలో ఆదివారం స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి సేవలు మరింత విస్తరించి ఆర్మూర్‌ను స్వచ్ఛ ఆర్మూర్‌గా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి ఆదివారం ఒక గంట పాటు స్వచ్ఛ కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. అనంతరం హనుమాన్ ఆలయం ఆవరణలో గల పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రకాశ్, ఆత్మచరణ్, శ్రీరామోజీ, ఆనంద్, ప్రశాంత్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సైపాన్ నిర్మాణం పూర్తయ్యేదెన్నడు?



లక్ష్మి కాలువపై నిర్మిస్తున్న సైపాన్

- లక్ష్మి కాలువపై రెండేళ్లుగా సాగుతున్న పనులు
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మికాలువపై ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారులో సైపాన్ నిర్మాణ పనులు రెండేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. కాలువ ఎగువ భాగం గల పంట భూముల నుంచి వచ్చే మిగులు జలాలను కాలువ దిగువ వైపు పంట పొలాలకు, చెరువులోకి తరలించుటకు నిర్మిస్తున్న నిర్మాణమే సైపాన్. లక్ష్మి కాలువ ఆధునీకీకరణ పనుల్లో భాగంగా సైపాన్ నిర్మాణం చేపట్టగా గత రెండేళ్లుగా పనులు సాగుతునే ఉన్నాయి.

ఈ సీజన్‌లో పూర్తిచేస్తాం

ప్రస్తుత వేసవి సీజన్‌లో సైపాన్ పనులను పూర్తి చేస్తాం. లక్ష్మి కాలువ ఆధునీకీకరణ పనులను కూడ పూర్తి చేయుటకు చర్యలను తీసుకుంటున్నాం. సైపాన్ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం.

– సరేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

ఆనకట్ట ధ్వంసమైనా..


పనులు కొనసాగుతున్న సమయంలో ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు, మిగులు నీరు లక్ష్మి కాలువలోకి ప్రవేశించడంతో కాలువ ఆనకట్ట పూర్తిగా ధ్వంసమైంది. ప్రస్తుత సంవత్సరమైనా సకాలంలో పనులు చేపడుతారని ఆయకట్టు రైతులు ఆశించారు. నీరు నిలిపి వేసి, నెల రోజుల తరువాత నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కాలువపై వంతెనలా నిర్మించుట కోసం కావాల్సిన స్లాబ్ పనులు సాగుతున్నాయి. సెంట్రింగ్ కొట్టి, స్టీల్ పనులు చేపడుతున్నారు. మరో నెల రోజులు గడిస్తే లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల చేసే సమయం వస్తుంది. మళ్లీ పనులు అటకెక్కే ప్రమాదం ఉంది. పనులను వేగవంతం చేసి ఈ నెలఖారు వరకు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సాగని ఫ్లడ్ కంట్రోల్ రూం పనులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై నిర్మిస్తున్న ఫ్లడ్ కంట్రోల్ రూం పనులు ఏడాది కాలంగా ముందుకు సాగడం లేదు. మూడేళ్ల క్రితం ఫ్లడ్ కంట్రోల్ రూం నిర్మాణం కోసం గత ప్రభుత్వం 50 రూ.లక్షల నిధులను మంజూరు చేసింది. అప్పుడే పనులు ప్రారంభించారు. స్లాబ్ వరకు పనులు పూర్తి చేశారు. కాని గోడలు పెట్టడం మరిచారు. ఏడాది కాలంగా ఒక్క పని ముందుకు సాగడం లేదు. అయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఫ్లడ్ కంట్రోల్ సాంకేతికతను వినియోగించుకోవడం కోసం స్కాడాను తీసుకువచ్చారు. దీంతో కంప్యూటర్లు, సీసీ టీవీలు ఎక్కువగా సామగ్రి వచ్చింది. దీంతో ఉన్న ఫ్లడ్ కంట్రోల్ రూం సరిపోవడం లేదని కొత్త రూం నిర్మాణం చేపట్టారు. కాని పనులు ముందుకు సాగడం లేదు. వరదలు వచ్చే సీజన్‌లో కింది స్థాయి అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో పాములు, విషపు పురుగులు వస్తుంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఫ్లడ్ కంట్రోల్ రూం పనులను ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీజన్ వస్తున్నా కదలిక లేదు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చే సీజన్ వస్తున్నా ఇప్పటికి ఎలాంటి కదలిక లేదు. సీజన్‌లో ఫ్లడ్ కంట్రోల్ రూంను అమాత్యులు, ఉన్నత అధికారులు పలు మార్లు సందర్శిస్తారు. అయినా ఫ్లడ్ కంటోల్ రూం పనులపై ఎలాంటి చర్చ చేపట్టడం లేదు. పాలకులు , ఉన్నత అధికారులు స్పందించి వచ్చే సీజన్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఫ్లడ్ కంట్రోల్ రూం ఇరుకుగా ఉండటం వల్ల ఎస్సారెస్పీ నీటి లెక్కలపై కూడా స్పష్టత లేకుండా పోతోంది.



ఫ్లడ్ కంట్రోల్ రూం ప్రస్తుత పరిస్థితి

సమాచారం..

నేటి నుంచి కందకుర్తిలో శతచండీ మహాయజ్ఞం

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలో గల సీతారాం ధామ్ సంత్ సేవా ఆశ్రమంలో సోమవారం నుంచి తొమ్మిది రోజుల పాటు శత చండీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి పరమపూజ్య శ్రీశ్రీ 1008 శ్రీ మహారాజ్ మండలేశ్వర్ శ్రీ సీతారాందాస్ మహారాజ్ తెలిపారు. ఆశ్రమ ఆవరణలో నిర్మించిన శనిదేవుని 8వ వార్షికోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు

జీలుగ విత్తనాల పంపిణీ

వేల్పూర్: వేల్పూర్, రామన్నపేట్ గ్రామాలలో సోమవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తారని మండల వ్యవసాయాధికారి శృతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాక మంగళవారం రామన్నపేట్‌లో జీలుగ విత్తనాలు అందజేస్తారని వెల్లడించారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్-11.05, శుభం-1.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-4.30, హిట్-7.00, మిషన్ ఇంపాజిబుల్-10.15

స్క్రీన్-4 మిషన్ ఇంపాజిబుల్-10.00, 4.20, డెవిల్స్ డబుల్ నెక్ట్స్-1.30, సింగిల్-5.05, 7.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-10.35

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	88,985		

– నిజామాబాద్ బిజినెస్

అధ్వానంగా బొప్పాపూర్- హుమ్నాపూర్ రోడ్డు



రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్- హుమ్నాపూర్ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు గుంతలు పడి, కంకర తేలి ఘోరంగా తయారైంది. బొప్పాపూర్ గ్రామ రైతులు హుమ్నాపూర్‌లోని సొసైటీకి ఎరువులు, విత్తనాలు కోసం, వివిధ పనుల నిమిత్తం తరుచుగా వెళుతుంటారు. అడపాదడపా కురుస్తున్న వర్షానికి గుంతల్లో నీరు నిలిచింది. రోడ్డు బాగా లేనందున వర్షం కురిసినపుడు ఆర్టీసీ బస్సును సైతం రద్దు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రోడ్డు బాగు చేయించాల్సిందిగా గ్రామస్తులు వేడుకుంటున్నారు.

నిఘా నేత్రాలపై నిర్లక్ష్యమేల?

- నందిపేటలో పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని చెప్పిన పోలీసు వారే వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. శాంతి భద్రతలను పరిరక్షించడానికి, కేసుల ఛేదనలో సత్వర పరిష్కార మార్గాలను చూపించడానికి, అనుమానిత వ్యక్తుల గుర్తింపు సహా పలు ఘటనల్లో నిందితులను గురించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయి. ఈక్రమంలో నందిపేట పట్టణం నిర్మల్ జిల్లాతో పాటు మహారాష్ట్రకు పక్కనే ఉండడంతో నిఘా పట్టిష్టంగా ఉండాల్సిందని భావించి గతంలో పోలీసులు ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రధాన కాలనీలలో, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలిసులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పలు కాలనీల్లో ఇళ్ల వద్ద స్థానికులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు.

ఇదీ పరిస్థితి..

నందిపేటలో ప్రధాన కూడళ్లతో పాటు కాలనీల వద్ద సుమారు రెండు సంవత్సరాల క్రితం 48 కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో ప్రస్తుతం ఒక్కటి పనిచేయడం లేదు. పనిచేయని వాటికి కొన్నిసార్లు మరమ్మతులు చేయించి వదిలేశారు. అయినా కెమెరాలు పనిచేయకుండా పోయాయి. ఇటీవల కాలంలో నందిపేటలోని అనేక కాలనీల్లో బైక్‌ల చోరీ, సెల్‌ఫోన్‌ల చోరీ, ఇళ్లల్లో దొంగతనాలు చేసిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సీసీ కెమెరాలు పనిచేసి ఉంటే ఆయా ఘటనల్లో నిందితులను గుర్తించే అవకాశం ఉండేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత వాటికి మరమ్మతులు జరిపి పనిచేసేలా చూడాలని, మరికొన్ని ప్రాంతాలలో కొత్తగా కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపడతాం..

నందిపేటలోని ప్రధాన కూడళ్లు, కాలనీలు, సమస్యాత్మక ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం పాత వాటికి మరమ్మతులు చేయించి, కొత్తవాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

–చిరంజీవి, ఎస్సై, నందిపేట



నందిపేటలో పనిచేయని సీసీ కెమెరాలు